## ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 13 : ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌పై అవగాహన సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సంబంధిత కార్యనిర్వాహక శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌ని జిల్లాలో అమలు పరచాలన్నారు. గనులు, భుగర్భశాఖ, సహాయ సంచాలకులు ఇన్ చార్జి సంబంధిత కార్యనిర్వాహక శాఖ అధి కారులు, కాంట్రాక్టర్లకు ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీ మైన్స్ రమేశ్, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన సీఈవో అరెస్ట్


పట్టుబడ్డ సీఈవోతో ఏఎస్పీ అవినాశ్ కుమార్, పోలీసులు

భైంసా, జూన్, 13 : కుభీర్ మండలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులతో ఉడాయించి మోసం చేసిన మహిళా ఉత్పత్తి దారుల సంఘం కంపెనీ సీఈవో శ్రీనివాస్‌ను పట్టుకొని అరెస్టు చేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని విలే కరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుభీర్ మండ లంలోని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ. 53 లక్షల మేర ఇవ్వకుండా పరారయ్యారన్నారు. కుభీర్ మండలంలోని జాంగావ్, లోకేశ్వరం మండలంలోని మన్మధ్ గ్రామానికి చెందిన రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 3 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి సంగె శ్రీనివాస్‌ను పార్డీ (బీ) గ్రామం వద్ద పట్టుకొని దాదాపు రూ. 9 లక్షలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్పీ వెంట రూరల్ సీఐ నైలు, పోలీసులు, తదితరులున్నారు.



# బెల్ట్ తీసేనా?

గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- అధిక ధరలు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- మద్యానికి బానిసవుతున్న యువత

*ఆదిలాబాద్ జిల్లాలో మద్యం బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతున్నది. పల్లె పల్లెనా విచ్చల విడిగా వెలుస్తుండడంతో ముఖ్యంగా యువత మద్యం మత్తుకు బానిసవుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నది. కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులను స్థానికులు, మహిళలు వ్యతిరేకించినా ఫలితం లేకుండా పోతున్నది. ధనార్జనే ధ్యేయంగా అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ బెల్ట్‌షాపుల నిర్వాహకులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. బెల్ట్‌షాపులు గ్రామాల్లో ప్రశాంతతను దెబ్బ తీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బెల్ట్ షాపులు తొలగించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామీణులు, మహిళలు కోరుతున్నారు.*


మావల మండలం బట్టి సవర్‌గాంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్



ఆదిలాబాద్, జూన్ 13 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లోని పలు గ్రామాల్లో కొందరు కిరాణా, చిన్న దుకాణాలు పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారాలు, కూలీ చేసుకుని కుటుంబాలను పోషించుకోవాల్సిన వారిపై బెల్ట్‌షాపుల ప్రభావం చాలా కనబడుతున్నది. తాగుడుకు బానిసైన వారు పనులు మానివేసి ఉదయం నుంచి రాత్రి వరకు బెల్ట్‌షాపుల్లో మద్యం సేవిస్తూ ఉండడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఊరి మధ్యలోనే బెల్ట్‌షాపులు ఉండడంతో ఆ దారిలో పోవాలంటే మహిళలు, స్థానికులు భయపడాల్సి వస్తుంది.

### జిల్లాలో 300 వరకు బెల్ట్‌షాపులు

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాలతో పాటు గ్రామ శివారు ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు ఉన్నాయి. పల్లెల్లో సైతం ఈ దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. జిల్లాలో 300 వరకు బెల్ట్ దుకాణాలు ఉన్నట్లు తెలుస్తున్నది. గ్రామాల్లో దళారులు వేలం పాట ద్వారా ఈ దుకాణాలను దక్కించుకుంటున్నారు. వేలం పాట డబ్బులను రాబట్టుకోవడంతో పాటు, అక్రమ సంపాదన కోసం మద్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాకు పక్కనే మహారాష్ట్ర ఉండడంతో అక్కడి నుంచి సైతం మందుబాటిళ్లను తీసుకువచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం అధిక ధరలను వసూలు చేస్తున్నారు. ప్రతి బాటిల్‌పై రూ.30 నుంచి 40వరకు అదనంగా తీసుకుంటున్నారు. అధిక ధరల ఫలితంగా మద్యం కొనుగోలుదారులు నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు తెలిసే ఈ వ్యవహారం జరుగుతుందని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను తొలగించాలని కోరుతున్నారు.


కుంసరలో ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని నిరసన తెలుపుతున్న రైతులు

# ధాన్యం డబ్బులు చెల్లించాలి

## 20 రోజులైనా ఖాతాలో జమ చేయలేదు

- మిగిలిన వడ్లను కొనాలే
- కుంసరలో రైతుల నిరసన

భైంసాటౌన్, జూన్ 13 : కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ భైంసా మండలంలోని కుంసర గ్రామ రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు విక్రయించి ఇరవై రోజులైనా డబ్బులు చెల్లించడం లేదని తెలిపారు. వానాకాలం ప్రారంభమైనందున విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చులకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రెండు రోజుల్లోనే డబ్బులు ఖాతాల్లో జమయ్యేవని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై రోజులైనా డబ్బులు జమ చేయడం లేదన్నారు. సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించినా ఇప్పటివరకు తమకు ఓటీపీ రాలేదని, ఆధార్ కార్డు జిరాక్స్ అడగడం లేదని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఇంకా 100 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనాల్సి ఉన్నా ఇప్పటివరకూ లారీలు పంపించడం లేదన్నారు. ఈ నిరసనలో మాజీ సర్పంచ్ ప్రవీణ్, రైతులు సొలంకి రవికాంత్, సూర్యవంశీ రవికాంత్, శంకర్, గైక్వాడ్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

### వడ్ల పైసలొస్తేనే సాగు పనులు చేసుడు..

నాకు ఓటీపీ వచ్చి 12 రోజులైంది. కానీ ఇప్పటికీ నా ఖాతాలో పైసలు జమ కాలేదు. యాసంగిలో పండించిన వడ్ల పైసలు వస్తేనే నేను వ్యవసాయం చేయగలుగుతాను. పైసలు తొందరగా వస్తాయనుకొని క్వింటాలుకు 5 కిలోల చొప్పున తరుగు తీసినా ఒప్పుకున్నా. ఇప్పటికీ గ్రామంలో 100 క్వింటాళ్లకు పైగా వడ్ల కుప్పలు రోడ్లపైనే ఉన్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దాదాపు మా ఊరి వాళ్లు 200ల క్వింటాళ్ల వరకు నష్టపోయినం. మిగిలిన వడ్లను కొని, మా బాధను అర్థం చేసుకుని ఇప్పటికైనా పైసలు జమ చేస్తే బాగుంటది.

-రవికాంత్, రైతు, కుంసర



### మిగిలిన వడ్లు కొనాలి

తడిసిన ధాన్యాన్ని, మిగిలిపోయిన ధాన్యాన్ని ఒక లారీ తీసుకొచ్చి తీసుకెళ్తాం అన్నారు. నేను రోడ్డుపై ధాన్యం ఆరబోసి 20 రోజులకు పైగా అయింది. లారీ రాలేదు వడ్లు కొనలేదు. రోజు వడ్లకు కాపలాతోనే దినం గడిచి పోతున్నది. వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికైనా మా రైతుల బాధలు అర్థం చేసుకుని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నాం.

-గాయక్‌వాడ్ గౌతమ్, రైతు, కుంసర



### పైసలు లేకపోతే విత్తనాలు ఎట్ల కొనాలే

మా ఊరికి వచ్చే రోడ్డుపై చూస్తే అక్కడక్కడా ధాన్యం కుప్పలు ఇంకా కనిపిస్తున్నాయి. మిగిలిన వడ్ల కోసం లారీ పంపిస్తామన్నారు. ఇప్పటివరకు లారీ రాలేదు. ఎండిన ధాన్యాన్ని అమ్మి ఇరవై రోజులైంది. ఇప్పటికీ పైసలు జమ కాలేదు. పైసలు లేక వానాకాలం పంట కోసం విత్తనాలు, ఎరువుల కొనుడు ఎట్లనో అర్థమైతలేదు. పంట పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తున్నది.

-శంకర్, రైతు, కుంసర



## వెంచర్ కోసం వంతెన కూల్చిండ్రు..!


వంతెనను కూల్చివేస్తున్న జేసీబీ

*ఆదిలాబాద్ పట్టణంలోని మావలకు వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న వంతెనను జేసీబీతో కొందరు కూల్చివేశారు. ఆ ప్రాంతంలో ఇటీవల కొందరు రియల్ వ్యాపారులు వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తుండగా దారి నిర్మాణంలో భాగంగా వంతెనను ఎలాంటి అనుమతి లేకుండా కూల్చివేసినట్లు స్థానికులు ఆరోపించారు. వర్షకాలంలో మావల చెరువు నీటితో సమీపంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అధికారులు ఈ వంతెనను నిర్మించారు. వంతెన కూల్చివేతకు సంబంధించి ఆర్ అండ్ బీ అధికారులను సంప్రదించగా ఆ ప్రాంతంలో తాము ఎలాంటి పనులు చేపట్టలేదని, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. వంతెన పరిశీలించి కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.*

*- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్, జూన్ 13*

# బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

### సామూహిక అక్షరాభ్యాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతర్ల, మాడగూడ, పార్డి, పట్నాపూర్ పాఠశాలలకు చెందిన 185 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా సరస్వతీ దేవి చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేల ఒళ్లో చిన్నారులను కూర్చొబెట్టుకొని ఒక్కొక్కరికీ అక్షర శ్రీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గిరిజన బిడ్డల కోసం అక్షర శ్రీకారం కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ జాదవ్ అంబాజీ, జిల్లా క్రీడాధికారి పార్థసారథి, మండల విద్యాధికారి కిషన్‌గుప్తా, ఏసీఎం జగన్, జీసీడీవో ఛాయా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు చందన్, కిషన్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్ అక్షర శ్రీకారం చేయిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ

- ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుమారుడు దాడి చేశాడని బీజేపీ పట్టణ అధ్యక్షుడి ఆరోపణ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు !


గాయపడిన బీజేపీ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు గంద్రత్ మహేందర్

ఆదిలాబాద్, జూన్ 13 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ చర్చనీయాంశంగా మారింది. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుమారుడు పాయల్ శరత్ (బన్నీ), బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంద్రత్ మహేందర్ మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో మహేందర్‌కు గాయాలయ్యాయి. బాధితుడు మహేందర్ సోషల్ మీడియాలో పాయల్ శరత్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యేగా గెలిచిన 18 నెలల్లో మీ అహంకారం బయటపడిందని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. దాడికి పాల్పడిన వారిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహేందర్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## సాంకేతిక పద్ధతులతో మెరుగైన విద్యుత్ సరఫరా

### ఎన్పీడీసీఎల్ ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్, జూన్ 13 ( నమస్తే తెలంగాణ) : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు 33 కేవీ, 11 కేవీ సుదూరమైన లైన్లలో ఫాల్ట్ ఫ్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటు చేస్తున్నామని వీటి వినియోగంతో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించవచ్చని ఆదిలాబాద్ జిల్లా ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జేఆర్ చౌహాన్ అన్నారు. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లైన్లు మొత్తం తనిఖీ చేయకుండా ఫాల్ట్ ఫ్యాసేజ్ ద్వారా విద్యుత్ అంతరాయం కలిగిన ప్రాంతాన్ని గుర్తించవచ్చన్నారు. అంతరాయం కలిగిన ప్రాంతానికి సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేపట్టి కరెంటును పునరుద్ధరించవచ్చని తెలిపారు. దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. జిల్లాలో 18, 33 కేవీ విద్యుత్ ఫీడర్లలో 21 ప్రాంతాల్లో, 208, 11 కేవీ ఫీడర్లలో ఫాల్ట్ ఫాసేజ్ ఇండికేటర్లు బిగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.


## 'కిలిమంజారో'ను అధిరోహించిన నిర్మల్ వాసి



కిలిమంజారో పర్వతంపై సాయి ప్రసాద్

నిర్మల్ అర్బన్, జూన్ 13 : నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ సాయి ప్రసాద్ ఈ నెల 11న ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో గల సముద్ర మట్టానికి 5895 మీటర్ల ఎత్తులోగల కిలిమంజారో పర్వతాన్ని ఆయన అధిరోహించారు. 2023లో ఎవరెస్ట్ బేస్ క్యాంపు వరకు అధిరోహించగా తాజాగా కిలిమంజారో శిఖరాన్ని సైతం అధిరోహించడంపై ఆయనను జిల్లా ప్రజలు, మిత్రులు అభినందించారు.

## శిథిలమైన భవనాలను కూల్చివేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూన్,13: శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బడిబాట, శిథిల పాఠశాల భవనాల తొలగింపు, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ పలు అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 163 పాఠశాలల్లో 302 తరగతుల గదులు శిథిలావస్థకు చేరినట్లు గుర్తించామని అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

## విందులో ఉద్యోగులు.. ఖాళీగా కార్యాలయం

ఖానాపూర్ రూరల్, జూన్ 13 : ఖానాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకం ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద విందుకు వెళ్లడంతో ఈజీఎస్ కార్యాలయం ఖాళీగా కని పించింది. ఉద్యోగులు విందులో పాల్గొన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై ఎంపీడీవో సునీతను వివరణ కోరగా తాను సిబ్బందితో తాను కూడా ఆలయం వద్ద విందుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ఏపీవో సట్ల రమేశ్ వివరణ కోరగా తాను పోచమ్మ ఆలయం వద్ద పండుగ చేసుకున్నానని బంధువులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇద్దరు ముగ్గురు వచ్చారన్నారు. అయితే ఎనిమిది మంది వెళ్లినట్లు ఫొటో వైరల్ అయింది. కార్యాలయం పని వేళలో విందులు నిర్వహించుకోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.


మధ్యాహ్నం 3 గంటలకు బోసిపోయిన కార్యాలయం